క్లుప్తంగా

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో మంగళ, బుధ వారాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ వల్లభనేని రాజేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అచ్చమాంబ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


విశేష అలంకరణలో అచ్చమాంబ పేరంటాళ్లు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాలకు సోమవారం ఆలయ పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేయడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

బాధితురాలికి వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



కావలి: అధిక వడ్డీ రుణం చెల్లింపుల విషయంలో తలెత్తిన వివాదంలో బాధితురాలైన కావలి పట్టణానికి చెందిన పార్వతిని చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు నెల్లూరు సీతారావమ్మ, పానుగోటి అనురాధ, కుందుర్తి సునీత, కలవకూరి ధనమ్మ, నాగేశ్వరమ్మ, పర్వీన్‌జాని, పుల్లా తులసీ, వేమిరెడ్డి ప్రసూన సోమవారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఈ ఘటన విచారమని, తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎప్పుడూ అనైతిక చర్యలను ప్రోత్సహించలేదన్నారు. బాధితురాలు ఆరోపిస్తున్న దర్శిగుంట మహేంద్రకు వైఎస్సార్‌సీపీలో ఎలాంటి పదవులు లేవన్నారు. వ్యక్తిగత వివాదాలను వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యేకు ఆపాదిస్తూ గూండాయిజం ప్రోత్సహిస్తున్నట్లుగా టీడీపీ రాజకీయం చేయడం బాధాకరమన్నారు. పార్వతికి ఎమ్మెల్యే అండగా ఉండి, చట్టపరంగా చర్యలు తీసుకునేలా పోలీసులకు సూచనలిచ్చారన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


ప్రవాస భారతీయుడు రమణారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు, నాటా ఉపాధ్యక్షుడు కేవీ రమణారెడ్డి తన సొంత నిధులతో సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మండల స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారి రూ.11 వేలు, 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5వేలు చొప్పున ఆయన నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ సిద్ధంరెడ్డి రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్, నరేష్, గిరిరెడ్డి, రియాజ్, అన్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదంపై కేసు నమోదు

కొండాపురం: రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఖాజావలి తెలిపారు. రేణమాల గ్రామానికి చెందిన హుస్సేనమ్మ పొలం పనుల నిమిత్తం వెళ్లి రోడ్డు దాటుతుంది. అదే సమయంలో కొత్తపేటకు చెందిన చంద్రమౌళి కొండాపురం నుంచి కందుకూరుకు వెళుతూ మహిళను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సోమవారం హుస్సేనమ్మ బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చర్పించాలి

సంగం: బడిఈడు పిల్లలను నూరుశాతం పాఠశాలలో నమోదు చేయాలని జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారిణి (ఏఎంఓ) శాంతకుమారి అన్నారు. సోమవారం మండలం మర్రిపాడు గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ డ్రాప్ అవుట్ పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎంకు సూచించారు. మర్రిపాడు, గాంధీజన సంఘం, జంగాలకండ్రిక గిరిజన కాలనీల్లో తిరిగి పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగలక్ష్మి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి
- నియోజకవర్గానికి రూ.1,000 కోట్లపైనే సంక్షేమ, అభివృద్ధి నిధులు


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

సంగం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఏదైనా చెప్పాడంటే దానిని తప్పక నెరవేరుస్తారని, కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే అలవాటు ఆయనకు లేదని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం అన్నారెడ్డిపాళెంలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వలంటీర్‌తో పాటు సంబంధిత అధికారి ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. ఇందుకోసం ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలందరూ స్వయంగా చూస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో కనీసం రూ.100 కోట్ల మేర అభివృద్ధి కూడా జరగలేదన్నారు. మన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రూ.1,000 కోట్లకు పైనే సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేశారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి ఎంత కష్టమైనా పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేలా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దేవసహాయం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆనం ప్రసాద్‌రెడ్డి, మానికల చందు, గుండాల బాల చంద్రారెడ్డి, కరిముల్లా, ఎంపీడీఓ గోపి, ఎస్సై నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మకూరుకే ఐకాన్.. మున్సిపల్ బస్టాండ్

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- బస్టాండ్ పనుల పరిశీలన


బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్

ఆత్మకూరు: దివంగత మంత్రి, తన సోదరుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయాల మేరకు ఆత్మకూరుకు ఐకాన్‌లా మున్సిపల్ బస్టాండ్‌ను నిర్మిస్తున్నట్లు, ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న మున్సిపల్ బస్టాండ్ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 23న బస్టాండ్‌ను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బస్టాండ్ నిర్మాణానికి రూ.3.49 కోట్లు కాగా, డ్రైనేజీ, బాత్‌రూముల మరమ్మతులు, నూతన నిర్మాణాలకు రూ.80 లక్షలు సొంత నిధులు వెచ్చించినట్లు చెప్పారు. ఆత్మకూరు అభివృద్ధికి ఏడీఎఫ్ ద్వారా సొంత నిధులు, పలువురు దాతల సహకారంతో ప్రణాళిక మేరకు పనులు చేయించనున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్కులో మరో రెండు నెలల వ్యవధిలో నూతన పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నట్లు ఏడాదిలోపు దానిని పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి మండలానికి వ్యవసాయ ఉత్పత్తులు భద్రపరుచుకునేందుకు మల్టీ పర్పస్ గోడౌన్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. మర్రిపాడు కేంద్రంలో మిర్చి యార్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎంపీ ల్యాడ్స్ రూ.కోటి అభివృద్ధి కోసం ఇవ్వనున్నట్లు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారన్నారు. గతేడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆత్మకూరు పట్టణానికి రూ.12 కోట్ల అభివృద్ధి నిధులు త్వరలో రానున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా పట్టణ రూపురేఖలు మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, ఏఈ జే.ప్రసాద్, ఆర్ఐ ఖాసీం, పార్టీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, బాల అంకయ్య, సురేష్‌యాదవ్, మునిరెడ్డి, సయ్యద్ జమీర్, రహీం, రిజ్వాన్, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, మునిరెడ్డి, కె చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మహిళలకు కుట్టుమెసిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

కావలి: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అమరా కల్యాణ మండపంలో శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పది మంది మహిళలకు కుట్టుమెషిన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణనిచ్చి, మెషిన్లు పంపిణీ చేసిన సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన ద్వారానే సాధికారత సాధించగలరని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, స్వయం ఉపాధి ద్వారా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళా సంఘాలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ, రుణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసరా ద్వారా రుణాలు అందిస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. ఆసరాతో పాటు చేయూత, అమ్మఒడి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, చారిటబుల్ సంస్థ ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' వినతులు



కావలి: ప్రజల సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసే వినూత్న కార్యక్రమమైన 'జగనన్నకు చెబుదాం' ను కావలిలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్, తహసీల్దార్ కార్యాలయంలో మాధవరెడ్డి, ఆర్డీఓ కార్యాలయంలో శీనానాయక్ నిర్వహించారు. అధికారులు ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించారు. సమస్య వివరాలను కూడా అధికారులు శ్రద్ధగా అడిగి తెలుసుకున్నారు.

జలకళ మోటార్ల పంపిణీ



కలిగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జలకళ బోర్లు ఏర్పాటు చేసుకున్న రైతులకు సోమవారం మోటార్లు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జలకళ పథకంలో మండలంలో మొదటి విడత 21 మంది రైతుల పొలాల్లో బోర్లు వేసుకున్నారన్నారు. ఆరుగురు రైతులకు మోటార్లు, బోర్లు ఏర్పాటు చేయడానికి మోటార్లు, ఇతర సామగ్రిని అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుడుములదిన్నెపాడు పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, ఏపీఓ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి



ఉదయగిరి: పాడి రైతులు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు శ్రీధర్ తెలిపారు. ఆయన సోమవారం పశువైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వరదలు, తుఫానులు, పిడుగుపాటు, అడవి జంతువుల దాడిలో మృతి చెందిన పశువులకు వైఎస్సార్ బీమా పథకం వర్తిస్తుందన్నారు. సిబ్బంది బీమా పథకంపై గ్రామాలలో పాడిరైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక కుటుంబానికి ఐదు పశువులకు మాత్రమే బీమా వర్తిస్తుందన్నారు. పశువైద్యాధికారిణి అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటితో పసుపు కొనుగోళ్లు ముగింపు

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రం బుధవారం ముగుస్తుందని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభమైందన్నారు. ఇప్పటి వరకు 149 మంది రైతుల నుంచి 333.34 టన్నుల పసుపు కొనుగోలు చేశామన్నారు. మండలంలో ఇంకా పసుపు విక్రయించని రైతులు కొనుగోలు కేంద్రం వద్దకు తెచ్చి విక్రయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

21న సామూహిక యోగాప్రదర్శన

కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న మినీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న సామూహిక యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు యోగా కన్వీనర్ నల్లూరు రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు సామూహిక యోగా ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. స్థానికులు, యోగాపై ఆసక్తి కలిగిన ఔత్సాహికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

జెడ్పీ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి


జెడ్పీ చెర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ కీర్తన, ఎంపీపీ సుజాత

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు బోగోలు జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపీపీ మేకల సుజాత సోమవారం వినతిపత్రం అందజేశారు. నెల్లూరులోని కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను కలిసి పరిస్థితిని వివరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం లోతట్టుగా ఉండడంతో వర్షాకాలంలో నీళ్లు నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు కూడా వీలు కావడం లేదని, వర్షాలకు కాకముందే ప్రాంగణాన్ని మెరక చేయించేలా కోరారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, మేకల శ్రీనివాసులు, గండూరి శ్రీనివాసులు, సుందర్‌రాజు, షమీవుల్లా, తూపిరి మురళీకుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి మీకు లేదు

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ చోటా నాయకులకు లేదని ఉనికి కోసం ప్రెస్‌మీట్లు పెట్టుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు టీడీపీ చోటా నాయకులు ఎమ్మెల్యేను విమర్శలు చేస్తున్నారని ఆకాశం వైపు చూసి ఉమ్మివేస్తే వారి ముఖానే పడుతుందన్నారు. మేకపాటి కుటుంబం త్యాగాలకు ముందు ఉంటుందని 2012లో ఎఫ్ఐఆర్‌లో జగన్‌మోహన్‌రెడ్డి పేరు నమోదు చేయడంతో దానికి నిరసనగా ఎంపీ పదవికి రాజీనామా చేసిన గొప్ప వ్యక్తి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయన కుమారుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎమ్మెల్యేగా 2014–19లో ప్రతిపక్ష స్థానంలో ఉండడంతో టీడీపీ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి సహాయం చేయకపోవడంతో ఆయన తన సొంత నిధులతో పలు గ్రామాల్లో బోర్లు వేయించడంతో పాటు రైతులకు కాలువల పూడికతీత పనులకు యంత్రాలు సమకూర్చిన విషయం గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం ఎంజీఆర్ ఫౌండేషన్, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా రూ.10 కోట్ల సొంత నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఏడాదికో పార్టీ మార్చే నాయకుడి అనుచరులుగా చెప్పుకొని పరువు పోగొట్టుకోవద్దని హితవు పలికాడు.

నూతన ఎంఈఓ బాధ్యతల స్వీకరణ


ఎంఈఓకు యూటీఎఫ్ నేతల అభినందనలు


ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన ధనలక్ష్మి


బాధ్యతలు స్వీకరించిన సురేష్


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు

వరికుంటపాడు: ఎంఈఓ–2గా సీహెచ్ రమణయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. మర్రిపాడు మండలం కంపసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇక్కడ నియమితులయ్యారు. ఎంఈఓ షావుద్దీన్ ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు నూతన ఎంఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఈఓ బాధ్యతల స్వీకారం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం ఎంఈఓగా ఇ ధనలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉపాధ్యాయులు ఆమెను కలిసి అభినందించారు. నూతన ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మండలంలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగు పరచడంతో పాటు వారికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను అందేలా కృషి చేస్తానన్నారు.

కలిగిరి ఎంఈఓ–2గా బాధ్యతల స్వీకరణ

కలిగిరి: కలిగిరిలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ–2గా గోళ్ల సురేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను మండలంలోని ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

జలదంకి: జలదంకి ఎంఈఓ–2 గా సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి మండలం ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు.


బాధ్యతలు స్వీకరించిన మస్తానయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ఎంఈఓ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి–2గా తోట శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూరు మండలం కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇక్కడ నియమితులయ్యారు. ఎంఈఓ మస్తాన్‌వలి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

ఎంఈఓ–2గా మస్తానయ్య

చేజర్ల: చేజర్ల ఎంఈఓ–2గా డీసీ మస్తానయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మనుబోలు మండలం మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 హెడ్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. చేజర్ల మండలం మాముడూరు హెచ్‌ఎంగా పనిచేస్తున్న హేమసుందర రావు ముత్తుకూరు–2 ఎంఈఓగా బదిలీ అయ్యారు.

టీడీపీతోనే అభివృద్ధి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): నియోజకవర్గంలో టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మర్రిపాడు మండల కన్వీనర్ ఆరికట్ల జనార్దన్‌నాయుడు, తదితరులు పేర్కొన్నారు. మర్రిపాడులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. లోకేష్ యువగళం యాత్రపై ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేసేవారిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలిబోయిన లక్ష్మీ నరసయ్య, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, పడతల శ్రీనివాసులు, పుల్లయ్య పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి


వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: మండలంలోని మర్రిపాడు జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మేకపాటి పాఠశాలను సందర్శించారు. మౌలిక సదుపాయాలను పరిశీలించిన వారు విద్యార్థులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మారుబోయిన సురేష్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. దీంతో డీఈఓ గంగాభవానితో ఫోన్‌లో మాట్లాడారు. విద్యావ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు.

పలువురికి పరామర్శ

మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పరామర్శించారు. మండలంలోని జంగాలకండ్రికకు చెందిన ముత్యాల నాగభూషణం కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. సంగం, కోలగట్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కంటాబత్తిన అయ్యపురెడ్డి, తుమ్మల బోయమ్మ, మేకల రావమ్మ, పెనుబాక చెంచు కృష్ణారెడ్డి, తుమ్మల కిరణ్, ఆరుగుంట పెంచలరెడ్డి, వెన్నా వెంకట రామిరెడ్డి, కలిచేటి ఆదిశేషారెడ్డి, కల్లూరి హజరత్తయ్య, నేరెళ్ల శివ ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, కరిముల్లా ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న రాజేంద్ర, తదితరులు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మార్గదర్శకత్వంలో పని చేస్తున్నామని ఆత్మకూరు మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర అన్నారు. మండలంలోని సాతానుపల్లి, రామాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చేయూతనందించి బలోపేతం చేయాలన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టెం పిచ్చయ్య నాయుడు, శేషయ్య, తిరుమల పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్న సురక్షను నిర్వహించండి


జగనన్న సురక్షపై మాట్లాడుతున్న ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి


మాట్లాడుతున్న తహసీల్దారు ఏవీ రమణరావు

- ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి
- సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా అమలు జరుపుతున్న జగనన్న సురక్షను బాధ్యతగా నిర్వహించాలని ట్రైయినీ కలెక్టర్ విద్యాధరి, ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం జగనన్న సురక్ష అమలుపై 8 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ 23వ తేదీ నుంచి వారం రోజుల పాటు వలంటీర్లు వారి పరిధిలోని కుటుంబాలకు వెళ్లి పరిష్కారం కాని సమస్యలను నమోదు చేసుకోవాలని, వాటిని సచివాలయంలో, మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. 1వ తేదీ ఆయా సచివాలయాల పరిధిలో నమోదైన సమస్యలు తెలిపిన వారందరితో సమావేశం నిర్వహించాలని ఆర్థిక పరమైన సమస్యలు, ఆరోగ్యానికి సంబంధించి సీఎం సహాయనిధి నుంచి అందే సమస్యల తప్ప మిగిలిన వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

అనుమసముద్రంపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దారు అన్నదాత వెంకటరమణరావు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు ఆయన అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని, ఏ ఇంట్లో ఏ సమస్యలు ఉన్నాయో గుర్తించేందుకు ప్రవేశపెట్టిన కార్యక్రమమే జగనన్న సురక్ష కార్యక్రమమన్నారు. ప్రతి ఇంటికి వాలంటీర్ ద్వారా వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాన్ని చూపాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని, ఏఎస్‌పేటను నంబరు–1 స్థానంలో నిలపాలని తెలిపారు. ఈఓపీఆర్‌డి సంధాని, డీటీ, ఎంఈఓ జ్యోతి అధికారులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష

జలదంకి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పర్యవేక్షించేందుకు మండల శాఖ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, హౌసింగ్ ఏఈ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని ఇస్కపల్లి బస్‌షెల్టర్ వద్ద కల్వర్టు మీద కూర్చొని ఉన్న ఆరిక రమణారెడ్డి (70)ని ఓ కారు అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.